నేరస్థులు

[కథానిక]

శ్రీ సామవేదుల సీతారామశాస్త్రి

మామగారి సత్యకాలానికీ, అల్లుని అమాయకత్వానికీ సరిపోయిం దనుకొన్నారు ఆ ఊరివారంతా...కాళ్లు కడిగి పిల్ల నిస్తామంటే వేరే ఆలోచన ఏమి టని సిద్ధపడ్డాడు వెంకన్న...వంశం మంచి దయినప్పుడూ, పిల్లవాడు లక్షణంగా ఉన్నప్పుడూ ఆస్తీ గిస్తీ ఎందు కన్నాడు రామన్న...అదీగాక, తనదగ్గరే చిన్నప్పటినుండీ ఉండి, ప్రథమ శిష్యుడుగా తనను అనుసరించిన వెంకన్నను అల్లుడుగా పొందడం తన అదృష్టమే అనుకున్నాడు రామన్న. తల్లిదండ్రులూ, ఇల్లూ వాకిలీ లేక తన పంచను చేరినవాడయినా...ఆవిధంగా స్థిరపడిన సంబంధం ఏదో మంచి ముహూర్తాన ముడిపడింది.

పెళ్లయినతరవాతగూడా వెంకన్న అత్తవారింటనే ఉన్నాడు. అందుకు రామన్న అభ్యంతరము గూడా ఏమీ లేదు. అత్తగారికి ఈవిషయంలో కొంత కష్టంగా ఉన్నా, కూతురుముఖం చూసి ఊరుకోవలసివస్తోంది. కూతురిమీద అభిమానంచేత మాత్రం కాదు. కేవలం ఆమెనోటికి భయపడే... వాగ్ధాటిలో తల్లీ కూతుళ్లలో అధికు లెవ్వరా అన్నది వారు నిర్ణయించుకోలేకపోయినా, ఇద్దరూకూడా మొగాళ్ల మీదికి అధికారులే. రామన్న తన నలభైఏళ్ల కాపురంలోనూ వంటబట్టించుకున్నది అదే...అంత మాత్రంచేత అట్టి కష్టాన్ని వెంకన్న పూర్వం అనుభవించలేదని కాదు. గురువుగారితోపాటు తనకూ అట్టి ఆదరణే జరిగేది మునుపు గురుపత్నివల్ల...ఇప్పుడు తన భార్య తన అత్తగారికి తీసిపోకపోయినా, అప్పుడప్పుడు ఆ భీకరాకారంలోనే శృంగారం, ఆ అధికారంలోనే లాలన, ఆ భయంలోనే ఆనందం అనుభవించేవాడు వెంకన్న...అంతటితోనే సంతృప్తి పొందేవాడు.

రామన్నది మొదటినుండీ చితికిన సంసారమే. వారితాతలు మంచి వేదవేదాంగ వేత్తలు...వారి తాతముత్తాతలనుండీ చదివిన చదువే అతనూ చదివేడు. తన తండ్రికాలానికే వేదానికీ, పాండిత్యానికీ విలువ తగ్గిపోవడంవలన వేదముతోపాటు వివాహాదులుచేయించడం గూడా చెప్పేడు తనకు. దానివల్లనేనా బ్రతుకగలడేమోనని. తండ్రినాటికి ఉన్న ఆస్తి కొసవరకూ జీవించలేని ఇద్దరు కొడుకుల మందులకే అయిపోయింది. ఆఖరికి తన అవసానకాలంలోకూడా, ఉన్న ఒక్కకొడుకుకూ ఎక్కడ లేకుండా పోతుందో అని 'నాకు ఎంతమాత్రం మందు ఇప్పించవద్దు' అన్నాడు తండ్రి... అయినా ఉండబట్టలేక, రామన్న వైద్యులను పిలిచి చూపించేడు. వారు ఏమందూ ఈయకపోయినా వచ్చి చూచినందుకుమాత్రం డబ్బు పుచ్చుకున్నారు. ఇంకా పూర్వాచారాల్లో నమ్మకం పోని రామన్న హోమాలూ, జపాలూ, తపాలూ ఎన్నో చేయించేడు. ఎన్ని చేసినా అతని తండ్రి అనుకున్నన్ని రోజులుకూడా బ్రతక్కుండా కళ్లు మూసేడు.

అప్పటికీ కొంత ఆస్తి ఉండనే ఉంది. సర్దుకొని కాలక్షేపంచేస్తే సంవత్సరం అయేసరికి కొంత కళ్ల

బడుతుందికూడాను. దానికి తోడు, తను నేర్చిన విద్యనే పెట్టి ఇప్పుడు అందరూ ఉపయోగిస్తున్న నోరు పెట్టి వ్యవహరిస్తే బంగారు మేడలే కట్టవచ్చు... కాని రామన్న నిజంగా హరిశ్చంద్రుని కాలంలో పుట్టవలసినవాడు. ఇతని సత్యస్వభావం లోకులకు మరీ లోకువయిపోయింది. పూటకు రెండుశేర్లు ఇచ్చే గేదె సరిగ్గా పావుశేరు ఇవ్వడం బ్రహ్మాండమయిపోయింది...మిగిలినది దూడే త్రాగేదో, కాపరే అమ్ముకొనేవాడో ఎవరికి లక్ష్యం?...ఉన్న ఒక్క దొడ్డిలోనూ పాదులు పూయడమే చూసేడుగాని ఒక్క కాయ తిన్న పాపాన పోలేదు. ఇంటిది ఎంత ఏడిస్తేమాత్రం, యజమాని అయిన ఆ ఆసామీయే ఇచ్చేస్తూంటే ఆవిడమాత్రం ఏమిటి చేస్తుంది? ఎవరింట వివాహమయినా ఈయనదే పౌరోహిత్యం...కాని, ఈయన ఎవ్వరిదగ్గరా కానీ పుచ్చుకోడు. పైగా వధూవరులను దీవించి, అయిదురూపాయలకు తక్కువ కాకుండా కట్నం చదివించి మరీ వస్తాడు...అతనికి తీసిపోడు అల్లుడు. వారికి మాయ, మర్మం అంటే ఏమిటో తెలీదు. చెప్పడం అన్నప్పుడు ఉన్నది ఉన్నట్టు చెప్పడమేగాని, లేనిదానిని ఏవిధంగా ఉన్నట్టు చెప్పడమో వారికి అర్థంకాదు. అసలు అసత్యం అనేది ఒకటి ఉంటుంది, అది ఉపయోగించడానికి చాలా అందుబాటులోనే ఉంటుంది, దానిమీద నిజంగా హాయిగొల్పే సౌఖ్యం ఆధారపడి ఉంటుందనేవిషయం వారి ఊహ కందనిది. ఆవిషయం వారికి విశదీకరించబోతే, ఏమిటో ఒక గోడలోనుండి దూరిపొమ్మన్నట్లు తోస్తుంది వారికి. అసత్యం అంతటి దురాచరణీయంగా కనుపిస్తుంది వారికి. వారు అసత్య ప్రపంచకానికి గ్రుడ్డివారు. అనృతవాక్కులకు చెవిటివారు...అంటే, వారు విన్నదీ, చూసినదీ అంతా నిజమే నని నమ్ముతారు...

లోకంలో ఇంకా ఇటువంటి మనుష్యులు ఉంటారా అని అందరికీ ఆశ్చర్యమే...వారిని మోసపుచ్చి దొంగతనంగా సంగ్రహించినవారందరూ 'పాపం'అని బహిరంగంగా జాలిపడేవారు...వారింట నెలలతరబడి తిష్ఠవేసినవారందరూ 'ఏమి సత్యకాలం' అని దేశదేశాలా చాటేవారు. వారి పొలాలలో గడ్డి కోసుకొనేవారు, వారి దొడ్డిలో కూరలు కోసుకొనేవారు, ఆయనదగ్గర చేబదులు పుచ్చుకొని ఇవ్వనివారు అందరూ ఆయనఅమాయకత్వానికి జాలిపడేవారే... కాని ఏంలాభం?... పేరు దేశదేశాలా మోగిపోవడమే గాని, డబ్బు కర్పూరంలా ఎగిరిపోతోంది. ఉన్న ఒక్క మడిచెక్క బోగబంద క్రిందికి వెళ్లింది. ఇంటిమీద ఆరువందల అప్పు అయిపోయింది. దారిద్ర్యం అధికమవుతున్నకొద్దీ తల్లీకూతుళ్ల సాధింపులూ, కోపాలూ గూడా ఎక్కువయినాయి!...

ఈ పరిస్థితులలోనే తద్దిన మొకటి దగ్గరపడింది. అది రామన్న అమ్మమ్మగారిది. ఆమెకు ఏవిధమైన పుత్రసంతానమూ లేనందున దౌహిత్రుడైన ఈయనకే ఆ కర్తృత్వం సంప్రాప్తించింది. ప్రతీమారూ— "ఎందుకీ అక్కరమాలిన తద్దినం; డబ్బుదండుగకి; ఆస్తయినా కలిసివచ్చిందిగనకనా?"అని కామమ్మ ఎప్పుడూ పోరుపెడుతూనే ఉంది...కాని, ధర్మశాస్త్రం అంతా చదువుకున్న రామన్నకుమాత్రం దౌహిత్రుడయిన తను బ్రతికిఉండీకూడా, అమ్మమ్మకు తిండి లేకపోవడమనేది చాలా ఘోరంగా తోచింది. ఆ తద్దినమే మరొకవారంరోజులలో ఉంది.

అల్లుడూ మామలు చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ఒకనాటి సాయంత్రం...ఇంటివిషయంగూర్చి ఇంత తీవ్రంగా ఆలోచించడం ఇదే మొదటిసారి వారికి...

"తద్దినం ఎలా మానేయడమోయ్"అని చాలా బాధతో అడిగాడు మామగారు. "అబ్బే! తద్దినం ఎలా మానేయగలం మామగారూ, మరోటే, మరోటీనా..."అన్నాడు అల్లుడు. "అదే నేనూ అంటున్నాను...కర్తృత్వం మీదపడినతర్వాత తద్దినం మానేయడం ఎంత అన్యాయం! పితృదేవతలను మోసంచేస్తే ఇంకేమయినా ఉంటుందా?...కాని, చూసేవా...మీ..అత్తగారికి ఏవిధంగా చెప్పడం?" "మరి చెప్పాలి". చెప్పగలమనే ధైర్యం ఎవ్వరికీ లేదు.

"డబ్బుకు ఇంతలా చిక్కిపోతా మనకోలేదోయ్" అన్నాడు రామన్న...ఆయనదగ్గ శిష్య

రికం చేసినన్నాళ్లూ డబ్బు ఒక అవసరమైన పదార్థమనే సంగతే నేర్చుకోలేదు వెంకన్న. ఆ ప్రశ్న తనకు కాదన్నట్టే ఊరుకున్నాడు. "పోనీ, ఏదో ఇద్దరు బ్రాహ్మణులతో తెరిపి చేసుకుందా మంటే—"

"అంత బొత్తిగా ఎలాగండీ—పోనీ, మనం స్వయంగా పిలవకపోయినా, అభ్యాగతులకయినా పెట్టకుండా ఉండగలమా? అప్పుడే చాలామంది అడిగేరుకూడాను—'ఫలానాఅప్పుడు ఫలానా వారి తద్దినంకదా' అని...వారందరినీ కాదనలేము కదా!..."

"అదే నేనూ అంటున్నది!"...

రామన్నకి అంతా అయోమయంగా ఉంది... విశేషించి, ఈ సంగతి భార్యకు ఏవిధంగా తెలియబరచడమా అన్నదే తెలియడంలేదు.

ఇంతలో ఆవుకు కుడితిపెట్టడానికి బయటకు వచ్చింది కామమ్మ...చాలారోజులనుండీ అల్లుడూ మామలలో జరుగుతున్న ఈగుసగుసలు ఆమెకు బొత్తిగా కిట్టడంలేదు...అంతేకాక, నిష్కారణంగా మామగారిని పాడుచేసేస్తున్నాడని అల్లునిమీద అనుమానం... వీరిద్దరవేపూ చురచుర చూసి. ఆవుదగ్గరకు వెళ్లింది... ఇదే సమయ మనుకున్నాడు రామన్న. ధైర్యంచేసి భార్యను పిలిచేడు.

"ఏం, ఏంకొంపమునిగిం దేమిటి"అని ఉరిమింది కామమ్మ...

"అదికాదే, ఈ పున్నమ వెళ్లిన విదియకి—"

"ఆ, విదియకి—?"

"మా అమ్మమ్మతద్దినం మళ్లా వస్తోంది—"

కామమ్మ రౌద్రమూర్తి అయిపోయింది ఒక్కమారు..."నేను ఈ పనికిమాలిన తద్దినాలతోటే, ఈ సంతర్పణలతోటే ఈ సంసారం ఇంక చెయ్యలేను." అన్నది ఒక్క ఊపుతో.—"ఇంటికి నెమలిఈకంత ఉపయోగం లేదుగాని, తద్దినాలనీ, దానాలనీ, సంతర్పణలనీ ఒకటే తగులబెట్టడం, ఇదేం తగులబెట్టడమో గాని. ఊరివారందరి తద్దినాలూ ఈయనే పెట్టాలి... ఆ చచ్చినముండ ఒక కొడుకును కని మరీ చావకూడదూ!...సంసారం సగం చితికింది. పూటగడవడం కష్టంగా ఉంటే ఆ ఊసే అక్కరలేదు మామా అల్లుళ్లకు. శ్రాద్ధస్తమానం ఇక్కడ తిరగడమూ, అక్కడ తిరగడమూ! భోజనాలవేళకి పదిమందిని వెంటబెట్టుకొని రావడం!...నే వేగలేనమ్మా ఈయింట్లో...నే చెయ్యలేనమ్మా ఈ సంసారం" అని ఊరందరికీ వినిపించేవిధంగా స్వగతం ప్రారంభించింది...నూతిదగ్గర అంట్లుతోముతున్న కూతురు వచ్చి వయ్యారంగా గుమ్మానికి చేరబడి, "ఏమిటే అమ్మా" అని అడిగింది, గడ్డంక్రింద చేయిపెట్టుకొని, మొగుడివైపు ఉరిమినట్లు చూస్తూ..."ఏమి టేమిటే, ఉన్నది కాస్తా ఊర్చి ఏట్లో దింపేద్దామని చూస్తుంటే ఈయనా ఆయనానూ! ...ఊరివారందరి తద్దినాలూ ఈయనకే కావాలి!... ఇంట్లో ఏమున్నదీ, ఏమి లేనిదీ వీరి కక్కరలేదు కదా!...మొన్ననే ఇల్లు తాకట్టుపెట్టేరు, ఈరోజుకి ఒక్కగింజ మిగలలేదు; అప్పుడే అమ్మమ్మతద్దినానికి ఆలోచనలు చేస్తున్నారు! చచ్చినవారితో సమంగా మనమూ చస్తాముటే!...నామొగుడితోటే నే నవస్థపడలేకుండా ఉంటే, నీకూ అలాంటి ఆయనే ద్రోరికాడు. ఒక పనిలేదు, ఒక పాటులేదు; ఒక పొలం చూసుకోడంలేదు, ఒక పౌరోహిత్యం లేదు...తినేస్తుంటే ఎంతకని ఊరుతుంది. అందులోనే తద్దినాలూ, తతంగాలున్నూ" అని గోలెములో తవుడుపోసి కలపడం మొదలుపెట్టింది. "అయితే, నాన్నా, ఇటువంటి పరిస్థితిలో తద్దినం పెట్టగలమా"అని అడిగింది కూతురు... "ఏమిటిచేస్తాం...ఎంత ఇదయినా తద్దినం మానగలమా తల్లీ" అన్నాడు రామన్న దీనంగా. తల్లీకూతుళ్లకు తద్దినం ఎందుకు మానలేరో అవగాహన కాలేదు. ఉరిపడినాగాని తద్దినం మానడం ఎలాగో బోధపడలేదు మామా అల్లుళ్లకు.

"అదీగాక, మామగారొక్కరే కర్త ఆయెను" అన్నాడు అల్లుడు కొంచెం సాహసించి. "మీరూ మాట్లాడాలీ? చాలులెద్దురూ!!...అంత మామగారమీదా, నామీదా అభిమానం ఉంటే మీ సంసారం మీరే దిద్దుకుందురు" అన్నది కూతురు. సంసా

మం టే ఎటువంటిదో తెలియని వెంకన్నకు దిద్దుకోవల సింది ఏమీ కనుపించలేదు.

"మరి, డబ్బు లేనప్పుడు ఏం చేద్దా మనుకు న్నావు నా న్నా" అని అడిగింది కూతురు మళ్లా.

"ఏమిటి చేస్తాం...ఏదోఒకటి చెయ్యాలి..."

"చెయ్యండి, చెయ్యండి...మమ్మల్నందరినీ ఒక్కమారు గోతిలో దింపి అందరి తద్దినాలూ పెడుతూ ఉండండి" అంటోంది కామమ్మ...

"ఆ చెయ్యవలసిన దేదో ఇంతకుముందే చెయ్య వలసింది నాన్నా...ఈ ఒక్క ఇంటిమీదా, ఆ కాస్త భూమిమీదా అప్పుచేసి ఊరందరికీ దానం చేసేరు. గుప్తంగా వాడుకుంటే ఈసమయానికి ఉపయోగపడక పోనా!" అని నచ్చజెప్పబోయింది కూతురు.

"నువ్వు వెయ్యిచెప్పు, లక్ష చెప్పు...వారి కేమేనా బుర్రకెక్కితే కదే!...ఒక్కమాట చెప్తాను విను—వారిని వారిష్టమొచ్చినట్లూ చెయ్యనీ, నేను కాదనను...నేనుమాత్రం తద్దినాలకూ, వాటికీ ఒక్క పిసరు చెయ్యలేను. ఇప్పటికే నాకు మహాకష్టమయి పోతోంది...వా రెలా తెచ్చుకుంటారో; ఎలా చేసు కుంటారో...నేను చెప్పినప్పుడు విన్నారుగనక నా, ఇప్పుడు చెయ్యడానికి...పద పోదాం...ఇక్కడ ఉంటే నాకంతకంతకూ వెర్రెత్తుతోంది" అని కామమ్మ కూతురుచేయి పట్టుకొని లోపలికి లాక్కుపోయింది.

తుపాను చల్లారినందుకు మామా అల్లుళ్లు మనసు లోనే సంతోషించేరు. దీనివల్ల వారికి అర్థమయినది ఒక్కటే—వారు ఇంక ఈ ఇంటిలో తద్దినం పెట్ట లేరు; పెట్టించలేరు. అది నిశ్చయం...ఇక చెయ్య వలసిన దేమిటి ?...

"ఈ ఇంట్లో తద్దినం పెట్టగలమనే ఆశ లేదు వెంకన్నా...ఒక్క పిసరు డబ్బుగాని, గింజగాని ఇంటి నుండి సంక్రమింపదు" అన్నాడు రామన్న.

"నిజమే"...

"అంచేత మనం ఇం కెవరింటనయినా ఏర్పాటు చేయాలి".

"కామయ్యగారింట మన కన్నివిధాలా సదు పాయంగా జరుగుతుం దనుకుంటూ"నని సలహాఇచ్చేడు వెంకన్న.

"కాని మనకు కావలసిన డబ్బు ఎక్కడినుంచి వస్తుంది ?"

మామగారూ, అల్లుడూ ఆలోచనలో పడ్డారు... వారు డబ్బు ధారాళంగా ఖర్చుపెట్టిన ఘట్టాలు జ్ఞాప కానికి వచ్చేయి...అప్పు డంత లక్ష్యం లేకుండా ఖర్చుపెట్టిన డబ్బుగూర్చేనా వా రిప్పుడు ఆలోచిస్తు న్నది!...ఆవు కుడితి త్రాగి మూతి నాలుకతో తుడుచు కుంటోంది...అది చూలుతో ఉంది...నేడో రేపో ఈనుతుంది...ఛటీమని జ్ఞాపకం వచ్చింది అల్లుడికి— ఆ ఆవు ఒకటి తమకు మిగిలి ఉన్నదని. "పోనీ, ఇప్ప టికి ఈ ఆవువల్ల ఏమయినా డబ్బు వస్తుందేమో ?" అన్నాడు.

మామగారు ఒక్కమాటు ఉలికిపడ్డారు. "ఆవునే అమ్మకోవాలా ?" అని.

"మరేమిటి చేస్తాం; వేరే మార్గం ఏమయినా ఉంటే అనుకోవచ్చు" అన్నాడు అల్లుడు.

"గంగిగోవోయ్...నందినిలాంటి ఆవు."

"నిజమే...కాని తద్దినం మానగలమా ?"...

మామగారు శూన్యంగా ఆలోచిస్తున్నారు. వారికి అంతకుముందు ఒక ఆవు ఉండేది...ఆ ఆవు దూడే ఇప్పటి ఆవు...ఇంకా ఇది తొలిచూలు.

అప్పుడే, ఆ వీథిలోంచి మునసబుగారు వెళ్తూ, వీథి అరుగుమీద కూర్చున్నారుకదా అని ఒకమాటు రామన్నను పలుకరించేడు..."ఒక మాట, మీతో చిన్న విషయం మాట్లాడాలి..." అని పిలిచేడు రామన్న. మునసబు వచ్చి అరుగుమీద కూర్చున్నాడు.

ఆవువేపు చూస్తూ "దూడ మ వీపుగా పెరి గిందే!...చూలుతో ఉందిగామోసు" అన్నాడు మున సబు.

"అవునండీ, నేడో రేపో ఈనుతుంది అను కుంటున్నాము" అని, కొంచెంసేపు ఆగి—"మునసబు

గారూ! ఒక్క సహాయం చెయ్యాలి” అన్నాడు రామన్న.

“అయ్యో, దానికేమిటి?...చెప్పండి”అన్నాడు మునసబు పరధ్యానంగా. “అది కాదు బాబూ...ఒక వారంరోజులలోనే ఒక తద్దినం వస్తోంది...దాని ఖర్చుకు ఇప్పుడు డబ్బు లేదు. అంచేత, ఇప్పటికి మీ రేదయినా సహాయం చేస్తే, డబ్బు చిక్కగానే మళ్లా ఇచ్చేస్తాను”అన్నాడు రామన్న ఏదో తప్పు చేస్తున్నట్టు భయపడుతూ.

“అన్నా, ఎంతపని జరిగింది! ఇవాళ ప్రొద్దుటే ఉన్నదంతా ఊర్చి కోటిపల్లి సంతకి ఎడ్లజత తెమ్మని పంపించేనండీ...ఈ సంగతి నిన్ననే తెలిసిఉంటే ఎంత బాగుండిపోను!...”అన్నాడు అతుకులు తెలియని అబద్ధాలను నిజాలుగా చెలామణీ చెయ్యడంలో ప్రఖ్యాతిగాంచిన లౌకికుడైన మునసబు.

“అన్నా, అలాగా?...మరేమిటి చెయ్యమంటారు?”

“అదే ఆలోచిస్తున్నాను...ఏమిటి చెయ్యడం చెప్పండీ—నేను పంపించక నేపోయీమాట ఉంటే...” మునసబుగారు వారి భయంకొద్దీ పునరుక్తిదోషానికి పూనుకున్నారుగాని ఇన్నిసార్లు ఆ బ్రాహ్మణులకి చెప్పనవసరం లేదు.

“నిజమే లెండి......మీదగ్గర లేనప్పుడు మీరు మాత్రం ఏం చెయ్యగలరు చెప్పండి”...

“మీకు వీలయితే ఒక ఉపాయం చెప్పగలను...అంతే”...

“మీదయ”

“మీరుగాని ఈ ఆవుని అమ్మగలిగితే, మా తమ్ముడు కొనుక్కుంటాడేమో చూస్తాను—”

తన ఉపాయమే ఫలించబోతున్నందుకు వెంకన్న గర్వంగా గురువుగారి వేపు చూసేడు. రామన్న మాత్రం చాలా విచారంగా ఆలోచిస్తున్నాడు...ఆ సంగతి గ్రహించిన. మునసబు—“అలాకాక మీరు మరొక పదిహేనురోజులు ఆగగలిగితే ఏదోవిధంగా జతపెట్టగలను” అన్నాడు తద్దినం అనేది వెనకపెట్టడానికి వీలుపడదుకదా అనే ధైర్యంతో.

“అబ్బే! అదెలాగండీ, మరోటే, మరోటేనా? తద్దినమాయెను” అన్నాడు రామన్న తన నిస్సహాయతను నిరూపిస్తూ.

“అలాగయితే, మరి మీకు నే నేవిధంగానూ సహాయం చెయ్యలేను” అంటూ లేవబోయేడు మునసబు.

అడిగిన సహాయాన్ని ఇంత సులువుగాను, ఇంత కఠినంగాను ఎవ్వరయినా నిరాకరించగలరా అని అల్లుడు ఆశ్చర్యపోయేడు...గురువుగారి పొలాల్లోంచి ఎన్నిసార్లు తను స్వయంగా గడ్డికోసి మునసబుగారి ఇంటికి ఇచ్చేడుకాడు!

“కావలిస్తే ఆవుని ఒక రెండ్రోజులు మీ ఇంట్లో ఉంచుకోండి” అన్నాడు రామన్న.

“పాలీయని ఆవును ఇంట్లో ఉంచుకోడ మెందుకండీ మేతదండుగ! నాదగ్గరగాని డబ్బుంటే, అడగకుండానే ఇచ్చిఉందునే...ఏదో మాతమ్ముడు ఆవుకోసం ఎలాగూ చూస్తున్నాడుగాబట్టినీ, మీకు డబ్బు అవసరం గాబట్టినీ ఆవుసంగతి తెచ్చేనుగాని మీ ఆవు నాకు ఎందుకండీ”అన్నాడు మునసబు.

“పోనీ మామగారూ, ఆ ఆవుని అమ్మేస్తేనేమి?..మనం మళ్లా కొనుక్కోగలిగినప్పుడే కొనుక్కుందాం..ఏమిటంటారు మునసబుగారూ?” అన్నాడు వెంకన్న.

“నిజమే, అదీ బాగుంది...మీరు అప్పు పుచ్చుకున్నారన్న నామర్దాకూడా ఉండదు...అప్పుడే, ఈ ఖరీదులోనే మంచి ఆవు నోదాన్ని చూసుకోవచ్చు.”

“సరే...ఎవరినేనా పంపించండి, పట్టించుకెళ్దురుగాని—”

“ఎవరో ఎందుకండీ, నేనే తీసుకొనివెళ్తాను. తప్పేమిటి?...సాయంత్రంగాని, రేపుగాని డబ్బు పంపించేస్తాను” అన్నాడు మునసబు.

“డబ్బుకేమిటిలెండి...రేపే పంపించండి...కాని, ఏమాత్రం?”

“మనలో మనకు బేరా లేమిటండీ!...మీలాటి వారిని అన్యాయం చేసి, మేం గడించేదేమిటి చెప్పండీ

...అంచేత ఏదో మీకూ మాకూ సదుపాయంగా ఉన్నట్లు తేల్చేసుకుందాం..." అని సలహా ఇచ్చేడు మునసబు.

"నిజమే, నేనూ అదే అంటున్నాను...మీరు అనుభవజ్ఞులు...పశువుల ధర, నాణ్యం...అన్నీ మీకు తెలిసినట్టు మాకు తెలుస్తాయా ?...అంచేత ఆ ఆవును చూసి ఎంతధర అవుతుందో మీరే నిశ్చయించండి." అన్నాడు రామన్న మునసబుగారి సత్యవాక్పరిపాలకత్వాన్ని పూర్తిగా విశ్వసిస్తూ.

"నేను చెప్తే మీరు నమ్ముతారా" అన్నాడు మునసబు, సంశయిస్తూ. తను చెప్పబోయే మాట అంతటి నమ్మలేనిదే అని మునసబుగారి అభిప్రాయం.

"ఎంతమాట!" అన్నాడు నొచ్చుకుంటూ రామన్న. ఒకరు చెప్పిన మాట నమ్మకపోవడ మెలాగో వారికి తెలీదు.

"మొన్న అప్పయ్య ఇలాంటి ఆవునే ముప్ఫై అయిదురూపాయిలకు కొన్నాడు...ఇదికూడా అంత ఖరీదే చేస్తుం దనుకుంటాను"

"అలాగే కానీయండి; డబ్బుమాత్రం రేపు పంపించివేయండి...మాకు చాలా అవసరంగా ఉంది" అని సాగనంపేడు మునసబుని. ఆవుని తోలుకొని పోతూ, పాతికరూపాయిలకే అడగనందుకు చాలా విచారించేడు మునసబు.

జరిగిన సంగతి తెలిసినతర్వాత కామమ్మ చేసిన గోలకు అంతులేదు. ఎవరైనా క్రొత్తవారు ఆఊరు వచ్చిఉంటే, ఎక్కడో ఇల్లు అంటుకున్నాయేమోనని భయపడి ఉందురు. ఆరాత్రి వారి ఇంట్లో ఎవ్వరికీ కూడా భోజనాలు లేవు...మర్నాడు కామమ్మ జ్వరం చేత మంచ మెక్కింది. ఇంట్లో వంట, పెంట కూతురిదే...అత్తగారు మంచంమీదనుంచే మిన్నుముట్టేటట్లు కేకలేస్తోంది— "ఇంకెందుకు! నన్నుగూడా అమ్మేయండి...మీకూతుర్ని గూడా అమ్మేయండి—చచ్చిన వారి తిండికి బ్రతికున్నవార్ని కూడా చంపండి...లేకపోతే నిక్షేపంలాంటి ఆవును ఎవరివెంటో తోలేయడమేమిటి ?...వాడు డబ్బు ఇవ్వాలా ? ఏడ్పా ?...చేతులారా ఇల్లు కూల్చుకోవడమైంది... ఇంత ప్రపంచజ్ఞానం లేనివారితో ఎలా వేగడం..."

మామగారికి అంతా అయోమయంగా ఉంది...మునసబుగారు ముప్ఫయి అయిదు రూపాయిలు ఇస్తామన్న తర్వాతగూడా ఏమిటీ గడబిడకు అర్థం ? ఇస్తా నన్న డబ్బు ఇవ్వకపోవడ మంటూ ఉంటుందా? ...తనే ఇవ్వదలచుకోపోతే, ఇస్తానని ఎందుకంటాడు ?...ఈ ఆలోచనలతో తల్లడిల్లిపోతున్నాడు రామన్న...మాటకూ చేష్టకూ చాలా దూరం ఉంటుందన్న సత్యం గ్రహించలేక తల్లడిల్లిపోతోంది అతని మనస్సు.

రామన్న ఇంకా ఈసందిగ్ధంలో ఉంటూ ఉండగానే మర్నాటి మధ్యాహ్నంగూడా గడిచిపోయింది. చీకటి పడబోతోంది...రామన్నకు ఏమీ తోచలేదు. ఏమిటి ! మునసబుగారికి ఇంకా తెల్లవారలేదా ?...ప్రొద్దుటే డబ్బుపంపిస్తా నన్న మనిషి ఇప్పటివరకూ ఏమిటి చేస్తున్నట్లు?...లేక మరిచిపోయేడా ?...తనదికాని ఆవు తన దొడ్లో కనపిస్తూ ఉండగాకూడా మరిచిపోగలడా ?...రామన్న కేమీ అర్థంకాక అల్లుణ్ణి పంపించేడు...వెంకన్న కనుక్కొని వచ్చి—"డబ్బు జతపడలేదట ! రేపు సాయంత్రంలోపుగా ఇస్తా నన్నాడు" అని చెప్పేడు. "అవును గామోసు !...మన కెంత కష్టంగా ఉందో, డబ్బు జతపెట్టడానికి అతనికీ అంత కష్టంగానూ ఉండి ఉంటుంది" అనుకొని జాలిపడ్డాడు రామన్న.

రెండోరోజు సాయంత్రంగూడా గడిచిపోతోంది...అల్లుడూ మామలు అరుగుమీద కూర్చొని ఆలోచిస్తున్నారు..."మరి డబ్బివ్వకపోతే ఏమిటి చెయ్యడం" అని ప్రశ్నించేడు అల్లుడు. "ఏమిటి చేస్తాం, ఆవును మళ్లా తోలుకొని వచ్చేద్దాం...తగాదా దేనికి..." అన్నాడు రామన్న. "ఎక్కడా అమ్మడమో?" "అమ్మడమో కాదో అతర్వాత చూసుకోవచ్చును" అని శ్రద్ధగా సంభాషించుకుంటూఉండగా, మునసబు వారింటికి వచ్చేడు. డబ్బు తెచ్చిఉంటాడనుకున్నారు అల్లుడూ మామలు.

"డబ్బు తెచ్చారా ?" అని పలుకరించేడు రామన్న.

"ఏండబ్బు శాస్తుర్లుగారూ! పట్నం వెళ్లిన మావాడు ఇంకా రాలేదు...నిన్ననే వస్తాడనుకొని మీకు మాటకూడా ఇచ్చేనాయెను—" పాపం, తన అబద్ధపుమాట నిలుపుకోలేనందుకు ఎంత నొచ్చుకున్నాడో మునసబు !...

"పోనీ, ఆవును తోలించేయండి...మరెవ్వరికయినా అమ్ముకుంటాం"

"అబ్బే, తీసుకెళ్లిన ఆవును మళ్లా ఇచ్చేయడమేమిటండీ ! రెండ్రోజులు తిండిపెట్టికూడా...... అయినా, చూడండి ! వాడు వచ్చిఉంటే, వాడిదగ్గర పుచ్చుకొని మీకిచ్చేద్దునా?...పాపం ! మీకు ఆలస్యమయిపోతోందనే విచారిస్తున్నాను".

"నిజమే మునసబుగారూ, ఈపున్నమముందుగానే మాకు డబ్బు దొరకకపోతే మాపని జరగదు...మరోటీ మరోటీకాదు...తద్దినం కూడాను."

"నాకు తెలియదండీ !...అందుకే ఇంతలాగున కొట్టుకుపోతున్నాను...ఎలాగయినా ఆవలెల్లుండి సాయంత్రంలోపుగా మీడబ్బు మీకు పూర్తిగా ఇచ్చేస్తాను. మీరు మరేమీ బెంగపెట్టుకోకండి !"అని మునసబుగారు వెళ్లిపోయేరు.

ఆ మూడురోజులూ గడవడం మహా కష్టమయిపోయింది అల్లుడూమామలకు. ఇంటిలో అత్తగారిపోరు ఘడియఘడియకూ హెచ్చిపోతోంది. "ఏం, ఆవు తీసుకువచ్చేరా ?...పోనీ డబ్బు ఇచ్చేడూ... లేదుకదూ ?...నాకు తెలుసునే...నేను ముందే అనుకున్నాను. లేకపోతే వాళ్లు డబ్బుఇస్తారే అనుకున్నారా"

రామన్నకు మహదాశ్చర్యంగా ఉంది...... ఆ మునసబు స్పష్టంగా, అక్షరాలా "నేను ఇస్తాను" అని చెబుతూంటే, తనభార్య ఏ విధంగా అనుకోగలుగుతోందో ఇవ్వరని...ఇస్తానన్న మాటకి ఇవ్వను అనే అర్థం ఉంటుందా ?...ఈ విధమైన శ్లేషార్థాలే ఉంటే ఇంకేమయినా ఉందా ?...కాని, విశేషమేమిటంటే, ఆవిడ అన్నట్లే అన్నీ జరుగుతున్నాయి !... కామమ్మ అన్నట్లే మునసబు మూడోనాటి సాయంత్రానికి కూడా డబ్బు ఇవ్వలేదు. అల్లుణ్ణి పంపిస్తే, మధ్యాహ్నమే ఎక్కడికో వెళ్లేడనీ, మర్నాడు ప్రొద్దుటికి గాని రాడనీ తెలిసింది. అప్పుడే తద్దినం కూడా దగ్గరపడుతోంది !...

"ఏం, డబ్బు యిచ్చేడా ?" అని అడిగింది కామమ్మ మంచంమీంచే.

"లేదు.ఎక్కడికో వెళ్లేట్ట! రేప్పొద్దుటకు గాని రాడట !"

"నేను చెప్పలేదూ...! అంతా తెలుసు..మీరు మీచేత్తోటే చేసుకున్నారు"

"అవును"

"అవు నేమి టింకా...ఇప్పుడేనా మించి పోయింది లేదు...ఆ అవును తోలుకొనిరండి...ఈనిందట కూడాను"

రామన్నకు అదే సమంజసంగా కనుపించింది. "అనుకున్న రోజుకు డబ్బు ఇవ్వకపోతే ఏమి టను కోడం ? వారికి కొనడం ఇష్టంలేదు గామోసు." అనుకున్నారు గురుశిష్యులు. ఆరాత్రే పదిగంటలకు బయలుదేరేరు. పుచ్చపువ్వులాంటి వెన్నెల చెట్ల ఆకులు సందులలోంచి నేలమీద పడి వింతవింత ముగ్గులు పెడుతోంది. అల్లుడూ మామలు సరాసరి వెళ్లి మునసబుగారి పసువులశాలలో ప్రవేశించేరు దడితలుపు తెరుచుకొని. మామగారు తన గావంచా ఆవు మెడకు చుట్టి, కన్నె విప్పి పైకి తీసుకొని వచ్చేడు. అల్లుడు దూడను రెండు చేతులతోటే ఎత్తుకొని తెచ్చాడు. రామన్నను పోల్తి పట్టిన ఆవు కిక్కురుమనకుండా అతనివెంట బయలుదేరింది. వెంకన్న దూడను మెల్లిగా నడిపించుకుంటూ తీసికెళ్ళేడు. త్రోవలో నాయుడు అచ్చయ్య కనుపించి, "ఏటిబాబూ ఎక్కణ్ణుంచేటి తోలికెల్తున్నారు ?" అని భోగట్టాచేసేడు. "ఇక్కడేనోయ్...మునసబుగారి ఇంటినుంచి" అని చెప్పి యిల్లు చేరుకున్నారు. మామగారు ఆవును పాలలో కట్టేయగా, వెంకన్న దూడను పెరట్లోకి తీసుకెళ్లి కట్టి వేసేడు. ఇంక భయం లేదను

కొని, ఇద్దరూ కాళ్ళు కడుక్కొనివచ్చి, వీథి అరుగు మీద హాయిగా నిశ్చింతగా పడుకున్నారు.

మర్నాడు గురుశిష్యులిద్దరూ చెరువులో స్నానం చేసి, బారెడు ప్రొద్దెక్కుతుండగా వచ్చేరు ఇంటికి. ఇంటిదగ్గర చిన్నగుంపు చేరిఉండడంచూసి తొందరగా అడుగులు వేసేడు రామన్న. ఇల్లు చేరేసరికి కామమ్మ మంచందగ్గరనుంచి కేకలు స్పష్టంగా వినిపిస్తున్నాయి- "ఏం...దొంగతనం చేసేరా, ఖూనీ చేసేరా?...రండతనం చేసేరా?...రౌడీతనంచేసేరా?...పోలీసు లెందుకమ్మా మాయింటికి?...పోలీసు లేం దోచుకోవాలమ్మా మాయింట్లో!...ఇంతమంది ఈ ఊళ్ళో ఉండగా, మా యింట్లో ఏం పుట్టి మునిగిపోతోందని పోలీసులు మా యింటిమీద పడాలి?"...తన ఆలోచనల కంతరాయం కలిగిన వెంకన్నకు ఈ పోలీసులనే కింకరులను పెట్టి ప్రజల్ని ఎందుకు హింసిస్తున్నారో అర్థం కాక ఆలోచిస్తున్నాడు. రామన్న అయోమయంగా అక్కడ ఉన్నవారినందరినీ తప్పించుకుంటూ రంగంలోకి వచ్చేడు. అక్కడ ఉన్న వారిలో మునసబుగారు, పోలీసు సబ్ఇన్‌స్పెక్టరు, ఇద్దరు పోలీసులు, అచ్చయ్య మొదలైన వారు ముఖ్యపాత్రలుగా కనుపిస్తున్నారు.

"ఇతనేనండీ నిన్నరాత్రి నాదొడ్లోంచి ఆవును, దూడను తోలుకొని వచ్చేడు దొంగతనంగా." అని మునసబుగారు సబ్ఇన్‌స్పెక్టరుతో అన్నాడు. సబ్ఇన్‌స్పెక్టరు మీసాలు మెలివేస్తూ ఒకమాటు రామన్న వేపు చూసేడు.

"చిత్తంబాబూ, నేను పొలంమీంచి వస్తూంటే, వీరిద్దరూ ఆవును తోలుకొని వస్తూ కనుపించేరు." అన్నాడు అచ్చయ్య వెంకన్నను కూడా రంగంలోకి తీసుకొనివస్తూ.

సబ్ఇన్‌స్పెక్టరు ఒకమాటు గర్జించి — "ఏం రామన్నగారూ, ఏమిటంటారు?" అన్నాడు వెటకారంగా...

"అవునండీ, నిన్న నేనూ మా అల్లుడూ కలిసి ఆవును తోలుకొనివచ్చేము రాత్రిపూట" అన్నాడు రామన్న నిస్సంకోచంగా.

"ఎందుకు తోలుకొని వచ్చేరు దొంగతనంగా."

"దొంగతన మేమిటి!...పుచ్చపువ్వులాంటి వెన్నెలలో పెద్దవీథిలోంచే తోలుకొనివస్తే...ఆయన కవసరం లేదనుకొని తెచ్చేం..."

సబ్ఇన్‌స్పెక్టరుకు కాళ్లూ చేతులూ అందడం లేదు...పది అడుగులేనా లోతు ఉండదా అని అరుగు మీంచి గెంటినవాడు కాళ్లకి అరంగుళాల్లోనే నేల తగిలితే ఎట్టి అనుభవం పొందుతాడో అట్టి అనుభవమే పొందేడు సబ్ఇన్‌స్పెక్టరు. మునసబుగారినుండి కథ శాంతంగా విని, అది అర్థంచేసుకుందుకు పాతికరూపాయిలు వంటబట్టించుకున్న సబ్ఇన్‌స్పెక్టరు, రామన్న ఎన్నివిధాల తనను తప్పుత్రోవలలో పెట్టగలడో ఊహించుకున్నాడు. బహుశః 'నేను తేలే'దంటాడు, లేక 'ఎవరో తెచ్చి కట్టి ఉంటా'రంటాడు...అప్పుడు అచ్చయ్య సాక్ష్యం ఉంది...లేక మునసబే తీసుకుపొమ్మన్నాడంటాడు...అప్పుడు మునసబుగారే కాదంటారు... ఈవిధంగా తన బుర్రను ఖాళీచేసుకొని, నాల్గుగంటల సేపు యోజించి, అప్పటికీ ఎక్కడ తను ఊహించని విధంగా కథ తిరుగుతుందో అన్న భయంతోనే ధైర్యం అవలంబించి, రామన్నను పైవిధంగా ఎదుర్కొన్నాడు...కథ ఇంత తేలికగా పరిణమించేసరికి తబ్బిబ్బయిపోయేడు. ఇప్పుడు రామన్నను ఏ సెక్షను క్రింద అరెస్టు చెయ్యడమో అర్థం కాలేదు...దొంగతనం చేసిన తర్వాత నిజంచెప్పడం దోషం అనే క్లాజు ఏదయినా ఉంటే ఇంత తటపటాయించకపోవునేమో సబ్ఇన్‌స్పెక్టరు.

అయినా, మునసబుగారు లేనప్పుడు, రాత్రిపూట దొంగతనంగా వారి ఆవును తోలుకువచ్చినందుకు మిమ్మల్నిద్దరినీ అరెస్టు చేస్తున్నాను...మీ రిప్పుడు నాతో మేజస్ట్రీటుదగ్గరకు రండి" అని రామన్న చెయ్యి పట్టుకోబోయేడు. "ఆగండి.........నన్నుమాత్రం ముట్టుకోకండి, మడిగా ఉన్నాను...పదండి నేనే వస్తాను; అటుంచీ వచ్చేకే దేవతార్చన చేసుకుంటాను" అని రామన్న వారివెంట బయలుదేరేడు వెంకన్నతో సహా.

వీథిగుమ్మంలో నిలబడిచూస్తున్న కూతురుకు అంతా మాయలాగున కనుపిస్తోంది—మునసబు గారి మోసము, తండ్రి అమాయకత్వము, భర్త చేతకానితనము అన్నీ చూస్తూఉంటే, తను దూషించాలో, విచారించాలో, గర్వపడాలో, ఆనందించాలో, అభినందించాలో తెలియక తల్లడిల్లిపోయింది.

౨

మర్నాడు మేజిస్ట్రీటుకచ్చేరీలో రామన్న కేసు విచారణ జరగబోతుందని విని చాలామంది వచ్చేరు. న్యాయస్థానంలో అందరూ ఎలాగూ నిజమే చెప్పాలి గాబట్టి తనసంగతి సునాయాసంగా తేలిపోతుందని రామన్న నిర్భయంగా ఉన్నాడు.

మునసబు లాయరుగారికి డబ్బు బాగానే పోసేడు. నిష్కారణంగా ఈకోర్టులు తిరగకుండా, అందుకైన ఖర్చులో సగం ఆ ఆవుఖరీదుగా ఇచ్చేస్తే బాగుండిపోనని అనుకున్నాడా వెనుక...సరదాగా ఒక చిన్న తమాషా చేద్దామనుకున్న మునసబుగారికి ఈ ఖర్చుగాని, ఈ ఖర్చుకైన అవసరంగాని కనుపించలేదు... అదీగాక, ఇంతదూరం కథ వచ్చినతర్వాత తను నిజం ఒప్పుకొని నలుగురిలోనూ నగుబాట్లు చెందుతాడా ఎక్కడయినా ?...ఇందులో తన అన్యాయంమాత్రం ఏముంది ?...తన పాకలో ఉన్న ఆవును రాత్రిపూట దొంగతనంగా తీసుకుపోవడం నేరమని గవర్నమెంటువారి పోలీసులే నిరూపిస్తున్నప్పుడు తనెందుకు కాదనాలి చట్టవిరుద్ధంగా ?...

పోలీసు సబ్ఇన్స్పెక్టరు, మునసబు, లాయరూ ఒక గదిలో కూర్చొని జాగ్రత్తగా ఆలోచిస్తున్నారు. "మీరు భయపడకండి లాయరుగారూ...కేసు చాలా తేలికయినదే. అర్ధరాత్రి మునసబుగారు లేనప్పుడు రామన్న వారి దొడ్లోంచి ఆవును తోలుకుని వచ్చేడు. దానికి అచ్చయ్య సాక్ష్యం... ఈ విషయం రామన్నగూడా ఒప్పుకుంటున్నాడు." అన్నాడు సబ్ఇన్స్పెక్టరు ధీమాగా. "అందుకే నాకు లంగ రందడం లేదు...అలా ఒప్పుకోడం వల్లనే కేసు ఏవిధంగా తిరుగుతుందో చెప్పలేకుండా ఉన్నాను...ఆ రామన్నైనా యింతవరకూ మీముందు తన నేరం ఒప్పుకోవడంలో మరేమయినా బలం చూసుకొనే ఒప్పుకుంటున్నాడేమో మన్నందరినీ ఫసాయించడానికి !...మేజస్ట్రీటుగారికి ఇటువంటి అమాయకపు బ్రాహ్మలంటే ఒకవిధమైన జాలికూడాను...... అవునుగాని, మీరు ఆవును నిజంగానే కొన్నారా, మనలో మనమాట !" అని మునసబును అడిగేడు లాయరు.

"అయ్యో ! కొన్నానండీ, డబ్బంటే ఇవ్వలేదుగాని...రేపో ఎల్లుండో ఇస్తానన్నాను. అందుకు అతనూ ఒప్పుకున్నాడు"

"అక్కడే చిక్కుగా ఉంది...సరేలే, అవతలి పార్టీకి ప్లీడరు లేనందున సాధ్యమయినంతవరకు డబ్బు విషయం ఎత్తుకోకుండానే గడిపేద్దాం...కాని మేజస్ట్రీటు అడుగుతాడేమో ?"

"మేజస్ట్రీటు ఏమయినా పుచ్చుకొనే రకమా" అని అడిగేడు దానకర్ణుడయిన మునసబు.

"కాదండీ, అదే చిక్కుగా ఉంది.. అయినా ఆ బ్రాహ్మడిమీద మీ కెందుకంత పగ" అని అడిగేడు వకీలు. "పగ కాదండీ...పాపం...బ్రాహ్మడు మంచివాడే...కాని, కథ ఇంతమట్టుకు వచ్చినతర్వాత విడిచిపెడితే మా ఊరివారందరూ నన్నూ, సబ్ఇన్స్పెక్టరుగారినీ మామూలుగా చూస్తారా ?...మీకు తెలియనిదేమిటి చెప్పండి" అన్నాడు మునసబు......నలుగురిలోనూ గౌరవంగా బ్రతికి, పెద్దమనిషిలా చెలామణీ కావాలంటే ఎన్ని మార్గాలేనా తొక్కాలి!...

"సరే, మరేమిటి చేస్తాం ? అన్ని కేసులలాంటిది కాదు ఇది. ముందుగా ఆలోచించి చేసేదికూడా లేదు. అచ్చయ్యసాక్ష్యం మనవేపు స్పష్టంగానే ఉంది. మిగిలిన విషయాలన్నీ సమయాన్నిబట్టి చూడాలి" అని దస్తరాలు కట్టి కోర్టులోకి వెళ్లేడు లాయరు.

కోర్టులో మేజస్ట్రీటు కూర్చొని ఉండగా, రామన్న బోనులో నిలబడి ఉన్నాడు...మేజస్ట్రీటుగారు రామన్న ఊరు ఒకమాటు వెళ్లినప్పుడు వారింటిలోనే భోంచేసేడు. అనాడే తెలుసుకున్నాడు ఆ బ్రాహ్మడి అమాయకత్వం. రామన్నను చూడగానే—

"అయ్యో, మీరా !...ఇంకా ఎవరో అనుకున్నా, విషయ మేమిటి" అన్నట్టుగా చూచేడు. "ఏమీలేదు బాబూ, నాదగ్గర ముప్ఫయి అయిదు రూపాయలకు ఆవును పుచ్చుకొని, మర్నాడే డబ్బు పంపించి వేస్తానని చెప్పి తోలుకెళ్లి, ఇప్పటివరకూ డబ్బియ్యలేదు మునసబు. అంచేత నేనూ, నా అల్లుడూ కలిసి ఆవును తోలుకొని వచ్చేము రాత్రికిరాత్రి. అందుమీద ఏదో నేరం క్రింద మీముందు పెట్టేరు." అన్నాడు రామన్న నిస్సంకోచంగా.

మేజస్ట్రీటుకు జరిగిన సంగతంతా స్పష్టంగా అర్థమయింది. ఎవరో ద్రోహులు అన్యాయంగా ఈ అమాయకపు బ్రాహ్మణుణ్ణి కష్టపెడుతున్నారని తెలుసుకున్నాడు..."సరేగాని, నీ కెవరైనా ప్లీడరున్నాడా" అని అడిగేడు. "ప్లీడరా...ప్లీడరు దేనికి ?...సత్యమూర్తులు మీ రున్నారుకదూ న్యాయమేదో తెలుసుకుందుకు."

మునసబు, సబ్ ఇన్‌స్పెక్టరు, లాయరు ప్రవేశించేరు. విచారణ ప్రారంభమయింది. గుమస్తా కేసు యొక్క వివరాలు మొదలైనవి చదివేడు. ఆవు, పెయ్య వరండాలో కట్టబడ్డాయి. కేసు వివరాలు విన్నతర్వాత ఒక్క లాయరు తప్ప తక్కిన ముద్దాయీల నందరినీ పైకి పంపించేరు. మేజస్ట్రీటు రాత ముగించి, వకీలును చూసి—"క్రాస్ ఎగ్జామినేషన్ మొదలుపెడదామా" అన్నాడు.

"చిత్తం...మునసబుగారిని రప్పించండి" మునసబుగారు వచ్చి బోనులో నిలుచున్నాడు. పేరు, ఊరు ఇత్యాదులు అయినపిమ్మట—

"ఆ ఆవు మీదేనా" అని అడిగేడు లాయరు.

"చిత్తం, నాదే బాబూ, నేనే కొన్నాను... మొన్ననే మా యింట్లోనే యీనింది"

"నే నడిగినదానికే చెప్పండి.. మీ యింట్లోనే యీనిందా"

"చిత్తం..."

"ఎప్పుడు కొన్నారు?"

"అప్పుడే వారంరోజు లయింది"

"ఎవరిదగ్గర కొన్నారు ?"

"రామన్నగారి దగ్గరే కొన్నాను, ముప్ఫై అయిదు రూపాయలకు"

డబ్బుసంగతి ఎత్తేసరికి లాయరుగారు గతుక్కుమన్నారు.

"సరే. సరే,...మీరు ఆ యావు దొంగిలింపబడిన రోజున ఊళ్ళోనే ఉన్నారా ?"

"లేదండి, పొన్నూరు వెళ్లేను ఆ సాయంత్రమే...ఆమరునాడు ఉదయం చూడగానే ఆవు దొడ్లో లేనందున పోలీసులకు కబురుపెట్టి వెతికించేను"

"ఆవు మళ్లా ఎక్కడ కనుపించింది?"

"రామన్నగారి శాలలోనే"

"సరే, ఇంక మీరు వెళ్లవచ్చు." అని లాయరుగారు అన్నారు.

"నేనుగూడా కొన్ని ప్రశ్నలు అడగాలి" అని మేజస్ట్రీటుగారు అనేసరికి లాయరుగారికి ముచ్చెమటలు పోసేయ్. మునసబు తెల్లబోయేడు...మేజస్ట్రీటుగారు అడుగుతున్నారు—

"ఆవును రోజూ దొడ్లో ఎవరు కడుతూ ఉంటారు ?"

"నేనే ఎప్పుడూ కడుతూంటాను బాబూ"

"అదే నేనూ అనుకున్నాను...అంటే దొంగతనం అయినరోజున సాయంత్రమే మీరు వెళ్లిపోడం చేత, ఆవును శాల్లో కట్టకుండానే వెళ్లిపోయేరు గామోసు"

"అవును"

మేజస్ట్రీటుగారు మునసబును పంపించి, సబ్ ఇన్‌స్పెక్టరుని బోనులోకి ఎక్కించేడు. అతను రాగానే లాయరు అడగడం మొదలుపెట్టేడు. "దొంగిలింపబడ్డ ఆవు, దూడ మీకు ఎక్కడ కనుపించేయి"

"రామన్నగారి శాలలో"

"వారియింట్లో ఉన్నట్టు ఆచోకీ ఏమేనా తెలిసిందా ?"

"తెలిసింది...అచ్చయ్య చెప్పేడు"

"మీరు ఎన్నిగంటలకు రామన్నగారింటికి వచ్చేరు...?"

"దరిదాపు ఏడుగంటలకు"

"ఆవు వారిశాలలోనే ఉందన్నమాట"

"అవును."

"అదేనా ఆవు?"

"అవును, అదే ఆవు"...

"మీ రింకేమయినా స్టేటుమెంటు ఇస్తారా?"

"ఇంతకంటే చెప్పవలసింది ఏమీ లేదు... రామన్న, అతని అల్లుడు వెంకన్న ఇద్దరూ కలిసి ఆవును, దూడను తోలుకొని వచ్చి, ఆరాత్రిపూట వారి శాలలో కట్టుకున్నారట!...అందుచేత, వెంటనే వారిద్దరినీ అరెస్టుచేసి, కోర్టుకప్పగించి, పోలీసు సబ్ ఇన్స్పెక్టరుగా నే చేయవలసిన పని పూర్తిచేసేను." అని దిగబోతున్న అతనిని ఆపి, మేజస్ట్రీటుగారు చిరు నవ్వుతో—"నీపని నువ్వు చేసుకోవడంతో సరిపోదు... మరి రెండు మూడు ప్రశ్నలకు జబాబు చెప్పాలి" అన్నారు. సబ్ ఇన్స్పెక్టరు తెల్లబోతూ, "చిత్తం" అన్నాడు.

"సరే, నువ్వు దరిదాపు ఏడున్నరకి వెళ్లేవుకదూ"

"చిత్తం"

"అప్పుడు రామన్న వెంకన్నలు ఇంటిదగ్గర ఉన్నారా"

"లేరు, చెరువుకి వెళ్లేరు."

"సరే; నువ్వు వెళ్లిన సమయానికి ఆవు ఏం చేస్తోంది?"

"సాలకి దగ్గర్లో ఉన్న కుడితిగోలెంలో కుడితి తాగుతోంది"

ఈ జబాబు వినేసరికి లాయరుగారికి ఎందుకో అనుమానం కలిగింది.

కేసు నిష్కారణంగా చేతులోంచి జారిపోయే సూచనలు కనపిస్తున్నై. "ఇప్పుడే సాలలో ఉందని చెప్పేవే" అని జ్ఞాపకం చేసేడు లాయరు...సబ్ ఇన్స్పెక్టరు ఏదో తప్పుచేసినట్టు బిక్కముఖం వేసేడు. మేజస్ట్రీటు నవ్వుతూ—"చెప్పనీయండీ, కంగారెందుకూ. సబ్ ఇన్స్పెక్టరుకే తెలియదా?" అని మళ్లా, "దూడ పాలుత్రాగుతోంది గామోసు"అని ప్రశ్నించేరు. "అవును, తల్లిపాలు తాగుతోంది"అని జవాబు చెప్పేడు. "నీ వింక వెళ్లవచ్చును" అని మేజస్ట్రీటుగారు అతనిని పంపించివేసేరు.

అచ్చయ్య వచ్చి బోనులో నిలబడ్డాడు. లాయరు గొంతు సవరించుకొని ప్రశ్నించేడు.

"నువ్వు ఆ రాత్రి ఎక్కడనుంచీ వస్తున్నావు?"

"పొలంమీంచి"

"ఏ త్రోవవెంట వచ్చేవు?"

"రామన్నగారి ఇంటిముందున్న గొర్జిలోంచి"

"అయితే, అచ్చయ్యా, త్రోవలో నీకు రామన్న, వెంకన్న ఆవును తోలుకువస్తూ కనుపించేరు కదూ"

"చిత్తంబాబూ, నిజంగానే కనుపించేరు"

"నువ్వేం పలకరించలేదూ అప్పుడు!"

"పలకరించకేం బాబూ? 'ఇంత రాత్రప్పుడు ఎక్కడ నుంచేమిటి, ఆవుని దూడని తోలుకొస్తున్నా' రనిఅడిగేను...'మునసబుగారిఇంటినుంచే' అన్నారు."

"నువ్వు చూసినప్పుడు ఆ యావు పెనుగులాడు తోంది కదూ, వారు యీడ్చుకువెళ్తూంటే"

"అలాగే తోచింది బాబూ ఆ చీకటిలో"

"నా ఎగ్జామినేషన్ అయిపోయింది" అని లాయరు కూర్చున్నాడు.

"ఆరాత్రి వాళ్ళు తోలుకొనిపోతుండడం చూసి గూడా నువ్వు వెంటనే పోలీసుకు ఎందుకు రిపోర్టు చెయ్యలేదు...కనీసం, ఊళ్ళో నలుగురైదుగురినేనా లేపి చెప్పవలసిందే!" అని మేజస్ట్రీటుగారు అడిగేరు అచ్చయ్యను. అచ్చయ్య మొదటి ప్రశ్నతోనే గాబరాపడి పోయేడు...అంతకుముందు ఒకటి రెండుసార్లు కోర్టు ముఖం చూసేడుగాని, ఇంత డొంక తిరుగుడుగా ఎవ్వరూ అడగలేదు...అదీగాక, ఈ ప్రశ్నకు ఏమి జవాబు చెప్పితే ఏమి ముప్పు వస్తుందో అని భయపడి పోయి మౌనంగా ఊరుకున్నాడు...కేసు ఇప్పుడు

సంపూర్ణంగా తన చేతిలోకి వచ్చినందుకు మేజస్ట్రీటు సంతోషించేడు...

"సరే, నీపని అయిపోయింది...ఇంక రామన్న వెంకన్నలే ఉన్నారు. మళ్లా ఫలహారాల తర్వాత మొదలుపెడదాం" అని మేజస్ట్రీటుగారు లేచి తన రూములోకి పోయేరు. లాయరు సరాసరి బారురూములోకి వెళ్లి—"ఛ ఛ! కేసు ఎంత అడ్డం తిరిగింది. ఇంకెంత! ఆవును వాళ్ళు తోలుకోన్నేళ్లలేదని రుజూవయి పోతుంది. ఆ రామన్నను ఉన్నవి కాస్త, లేనివి కాస్త అడిగి కేసు కొట్టివేస్తాడు. పేరు పోగొట్టుకుందుకే ఈ కేసులో చొరబడ్డాను." అని విచారిస్తూ ఉంటే మునసబుగారు, సబ్ ఇన్‌స్పెక్టరు, అచ్చయ్య అక్కడకు వచ్చేరు. "బొత్తిగా పాడుచేశారండీ కేసంతా...లేకపోతే ఇంత పాడుచేసుకుంటారా ఎవరయినా" అని లాయరుగారు తన చేతకానితనాన్ని వారందరికీ పంచిపెట్టేడు. "మే మేమిటి చేసేము లాయరుగారూ, మీ అంతటివారు ఆలోచించి చెప్పిన విధంగానే కదా మేమూ చెప్పేము...కథ తికమక లయి ఈవిధంగా తిరుగుతుందని మీరు చెప్తేకదా!" అని మునసబు అన్నాడు.

"అదే, దోషం అవునా, కాదా అన్నదే మేజస్ట్రీటు ఆలోచిస్తారనుకున్నానుగాని, మేజస్ట్రీటుగారే వారిపక్షం తీసుకొని కేసును మొదట్లోనే బోల్తా కొట్టిస్తా రనుకోలేదు. అందుకు తగినట్టు మీరూ, అచ్చయ్యకూడా మంచి చెడ్డ ఆలోచించకుండా ఇష్టమొచ్చినట్లు చెప్పేరు...ఎవరి సాక్ష్యం బలమయినదనుకున్నానో, ఆ అచ్చయ్యసాక్ష్యమే ఒట్టి అబద్ధపు సాక్ష్యంక్రింద తేలింది...ఆఖరికి ఈ ఒక్క కేసుతోనే నాపేరు మాసిపోయేట్టున్నది" అని లాయరు తన విచారాన్ని, అశక్తతని వెలిబుచ్చేడు.

మేజస్ట్రీటుగారు తిరిగివచ్చి కుర్చీలో కూర్చున్నాడు. కోర్టు అంతా నిశ్శబ్దంగా ఉంది. ప్రేక్షకజనం కిక్కురు మనకుండా ఉన్నారు...ఒక్క గడియారంశబ్దమే స్ఫుటంగా వినిపిస్తోంది. లాయరుగారు క్రాసుఎగ్జామినేషన్ ఏవిధంగా మొదలుపెట్టడమో అర్థంకాక అవస్థపడుతున్నాడు.

మేజస్ట్రీటుగారు వ్రాత ముగించి, రామన్నను తీసుకు రమ్మన్నాడు. ఇద్దరు పోలీసులు రామన్నను బోనులో నిలబెట్టి ప్రక్కన నిలుచున్నారు. గుమస్తా రామన్న పేరు, ఊరు, వయస్సు ఇత్యాదులన్నీ అడిగి, "నేనన్నట్టు ప్రమాణం చెయ్యి" అన్నాడు. రామన్న గతుక్కుమని "ప్రమాణమా" అని అడిగేడు. "అవును, ఈకోర్టులో ఉండగా, నేను నిజమే చెప్తాను అని ప్రమాణం చెయ్యాలి" అన్నాడు గుమాస్తా. "ఆమాత్రం దానికి ప్రమాణం దేనికి?...నేనిక్కడే కాదు, ఎక్కడయినా నిజమే చెప్తాను" అన్నాడు రామన్న... "నిజమే చెప్పే మీకు ప్రమాణం చెయ్యడానికి భయమెందుకు" అని లాయరుగారు అన్నారు. "అబద్ధాలు చెప్పేవారిని మాత్రం ప్రమాణాలు అడ్డుతాయా" అని లాయరుగారికిమాత్రమే వినిపించేటట్టు అన్నారు మేజస్ట్రీటుగారు.

"ఎప్పుడయినా, ఏవిషయంలోనయినా ప్రమాణం చెయ్యడం దోషం అని ధర్మశాస్త్రం ఘోషిస్తూ ఉంటే..." అని రామన్న నసిగేడు. ప్రమాణానికీ కోర్టులో వింటున్న మాటలకు గల సంబంధం తెలిసిన గుమాస్తాకు ప్రమాణంచెయ్యడం ఏవిధంగా దోషమో అర్థం కాలేదు. "అప్పటి ధర్మశాస్త్రాలు వేరు, ఇప్పటి ధర్మశాస్త్రాలు వేరు. ఇప్పుడు ప్రమాణం చెయ్యనిదే, ఏమాటగూడా విశ్వసనీయమని ఎంచబడదు కోర్టులో..."అని లాయరుగారు విశదీకరించేరు. "అవును, ప్రమాణంచేసినతర్వాత ఏది చెప్పినా కోర్టు నమ్ముతుందనే లాయర్ల భావన" అన్నారు మేజస్ట్రీటుగారు. అందరూ ప్రమాణాలు చేసి ప్రమాణాలు చేసినట్టు నిజం చెప్తూంటే, తనవంటి గుమాస్తాలు, ఎంతమంది నిరుద్యోగు లయిపోవాలో అని గుమాస్తా దిగులు గుండెతో ఆకాశం వేపు చూస్తున్నాడు.

"సరే, మేజస్ట్రీటుగారే తప్పులేదని చెప్తూంటే నేను ప్రమాణం చేయదలచుకున్నాను. అయినా నిజమే చెప్పదలచుకున్నప్పుడు ప్రమాణం చేసినంతమాత్రాన దోష మేమిటి?" అని గుమస్తా చెప్పిన విధంగా ప్రమాణం చేసేడు రామన్న.

"లాయరుగారూ, మీరు అడుగదలచిన దేదో మొదలు పెడతారా?" అని మేజస్ట్రీటుగారు అన్నారు. వెంటనే లాయరు లేచి, "ఆ ఆవును చూసేరా?" అని అడిగేడు.

"చూసేను... ఆ ఆవు నాదే"

"అడిగినదానికే జవాబు చెప్పండి. ఆ ఆవును మునసబు గారికి అమ్మేరుకదూ?"

"అవును. ముప్ఫయిఅయిదు రూపాయీలకు అమ్మేను. ఇంకా—"

"ఆగండి. నేనడిగినమట్టుకే చెప్పండి. ఆ ఆవు ఎక్కడ ఈనింది?"

"మునసబుగారి ఇంట్లోనే—"

"అంటే ఆదూడగూడ మునసబుగారిదే నన్న మాట!"

"కాదు. ఆదూడ ఆవుదే" అన్నారు మేజస్ట్రీటు గారు నవ్వుతూ — ప్రేక్షకులందరూ ఒక్కమాటు గొల్లు మని నవ్వేరు. లాయరు ముఖం చిట్లించి, గొల్లు తగ్గగానే మళ్లా ప్రారంభించేడు.

"మీరు అమ్మిన తర్వాత ఒక్కమాటు గూడా ఆ యావు మీ యింటికి రాలేదుకదూ"

"లేదు. ఎప్పుడయినా వస్తే, ఆవులుకాచే కుర్రాడే తోలుకొని పోయేవాడు"

"ఆనాడు రాత్రి మీరూ, మీ అల్లుడూ కలిసి ఎక్కడనుండి వస్తున్నారు?"

"మునసబుగారి యింటినుండి" అని జబాబిచ్చేడు రామన్న.

"సరే, మీరు యింటికి వస్తున్నప్పుడు ఈ ఆవును, దూడను తోలుకొని వచ్చేరుకదూ?"

మేజస్ట్రీటుగారు జాగ్రత్తగా వింటున్నారు...

"అవును"...రాస్తున్న కలం అట్టే వదిలేసేడు మేజస్ట్రీటు. వెంటనే కలుగజేసికొని "అంటే, త్రోవలో తిరుగుతూంటే, ఇక్కడెందుకని తోలుకొనివచ్చేరు గామోసు" అని అందించేడు.

"అబ్బే! లేదండి, వాళ్ల పాకలోంచే తోలుక వచ్చేము" అన్నాడు రామన్న.

"నువ్వు ఆవును అమ్మదలుచుకున్నావుకదూ మునసబుగారికి" అని అడిగేడు మేజస్ట్రీటు.

"అవును."

"మునసబుగారు ఏమయినా డబ్బు ఇచ్చేరా?"

"లేదు బాబూ. ఇదిగో ఇస్తాను అదిగో ఇస్తాను అని చాలారోజులు త్రిప్పేరు."

"త్రిప్పిత్రిప్పి ఆఖరుకు ఇవ్వనుపొమ్మన్నారు గామోసు"

లాయరు శ్రద్ధగా వింటున్నాడు. ఈప్రశ్న ఒక్కటి చాలు కేసునంతటినీ తారుమారు చెయ్యడానికి. రామన్న నిస్సంకోచంగా—

"ఇవ్వలే ననలేదుగాని, ఆవిధంగానే ప్రవర్తించేడు" అన్నాడు. లాయరు వెంటనే కలుగజేసికొని, "ఇవ్వలే ననిమాత్రం అనలేదు కదూ. స్పష్టంగా చెప్పండి" అన్నాడు. "ఇవ్వలేననిమాత్రం అనలేదు."

ఇటువంటివారికి తను ఎందుకు సహాయంచెయ్య దలచుకున్నాడో మేజస్ట్రీటుకు అర్థం కాలేదు. తనపై అన్యాయంగా ఆరోపింపబడిన కేసులో, తన రక్షణ కోసం, ఒక్క అసత్యం, ఒకే ఒక అబద్ధం ఆడలేని వారిని ఎంతకని ఎగత్రోయడం! అదీగాక, దోషం ఏ మాత్రం లేకుండా, వారి నేరం ఏమీ లేదని స్పష్టంగా కనుపిస్తున్న కేసులో. తను ఎందుకు నిర్దోషిని విడిచి పెట్టలేకపోతున్నాడో అవగాహన కాలేదు మేజస్ట్రీటుకి...

ఏదో ఆఖరి ప్రయత్నంగా మేజస్ట్రీటు మరొక ప్రశ్న అడిగేరు. "ఎప్పుడు ఇస్తానన్నాడు డబ్బు?"

"ఆరోజు సాయంకాలమే."

"అన్నప్రకారం ఆసాయంత్రం ఇవ్వలేదు కదూ?

"లేదు. అపుధ్యాహ్నమే ఏదో ఊరు వెళ్లేడట!" మేజస్ట్రీటుగారికి కొంత ఆసరా దొరికింది మళ్లా. "ఇస్తానన్న రోజుకు ఇవ్వకపోవడమే కాక, కనుపించ

కుండాపోవడంవల్ల ఆవును తోలుకొని వచ్చేరన్న మాట."

"అవును."

కేసు దొంగతనంగా కాకుండా, ఇంకోవిధంగా తిరిగి, మునసబుగారికే దెబ్బతగిలేట్టున్నదని లాయరు ఆలోచించి, "మునసబు ఆమర్నాడే వస్తాడని మీకు తెలుసునుకదూ?" అని ప్రశ్నించేడు.

"అవును, తెలుసును."

"ఆ సాయంత్రం డబ్బు ఇవ్వకపోతే ఆవును తోలుకొనిపోవచ్చునని మునసబుగారు చెప్పేరా?"

"లేదండీ. అలాగునే అంటే ఈబాధలే లేక పోను. మా అవసరంకొద్దీ మేమే తోలుకొనివచ్చేం."

మేజస్ట్రీటుగారికి ఒకవంక కోపమూ, ఒకవంక కోపమూగూడా వచ్చింది. ఎప్పుడూ లేనిది తను ఈ రోజున స్పష్టంగా కలుగజేసికొంటే, ఈకేసే ఇంత విపరీతంగా తిరగాలా?......తన సహాయాన్నైనా గుర్తించకుండా ప్రవర్తించిన రామన్నమీద కోపము, అతని అమాయకత్వంమీద జాలి రెండూ కలిసేయి. కాని ఏంచెయ్యగలడు?...

"సరే, ఇంకా ఏమయినా చెప్పవలసిఉంటే చెప్పు" అని తను ఏదో వ్రాసుకోడం మొదలు పెట్టేడు.

"ఆ మునసబు ఆరోజుసాయంత్రానికి అన్న ప్రకారం డబ్బివ్వలేదు. తద్దినంగూడా దగ్గరపడుతోంది. అదీగాక ఇంట్లో మా ఆడదికూడా ఆవును తోలుకొనిరమ్మని తినేస్తోంది. అందుచేత, ఆగాత్రే నేనూ, మా అల్లుడూ బయులుదేరి, ఆవును నేనూ, దూడను మా అల్లుడూ తోలుకొనివచ్చి మాయింట్లో కట్టేసేం. మరునాడు వీరంతా కలిసి మీముందు పెట్టేరు." అన్నాడు రామన్న తనకు కలుగబోయే విపత్తుతో లక్ష్యం లేనట్టు.

మేజస్ట్రీటుగారు తన వ్రాత ముగించి, తన తీర్పును ఈవిధంగా చదివేరు—

"మునసబుగారు ఇంట్లో లేని సమయమందు రాత్రిపూట వెళ్లి మునసబుగారి ఆవులసాలలో ఉన్న ఆవును, పెయ్యను, దొంగతనంగా రామన్న తన యింటికి తీసుకొనివచ్చినట్లుగా కోర్టువారి ముందు ఉంచబడిన సాక్ష్యములవల్ల తెలియుచున్నది. అందుచేత ఈ దొంగతనములో పాల్గొన్న రామన్నయున్నూ, అతనికి సహాయముచేసిన వెంకన్నయున్నూ నేరస్థులుగా ఈకోర్టువారిచే నిర్ణయింపబడింది. వారి నేరమును వారే స్వయముగా వ్యక్తపరుచుటచేతను, కొన్ని అసహాయపరిస్థితులలోనే వారా నేరమును చేయుటచేతను, రామన్నకు పదిహేనురోజులును, వెంకన్నకు వారమురోజులును కారాగారశిక్ష నేటినుండి విధింపబడినది"—అని పూర్తిచేసి తన కుర్చీలో మళ్లా కూర్చున్నారు.

"నా ఆవును నేను తోలుకొనివచ్చినా దోషమేనా?" అని రామన్న అడిగేడు దీనంగా.